# నిండా ముంచిన వాన



మహబూబాబాద్ నుంచి ఆకేరు వాగును దాటి మరిపెడ బంగ్లా వైపునకు ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ప్రయాణికులు


మహబూబాబాద్ జిల్లా సీతారాం తండాలో ఇంటిలోకి చేరిన బురదను బిందెల్లోకి ఎత్తుతున్న వరద బాధితులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు తెలంగాణ అతలాకుతలమైంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. పలు ఇండ్లలోకి వరద నీరు చొచ్చుకు రావడంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, బియ్యం, పప్పులు, దుస్తులు పనికిరాకుండా పోయాయి. కనీసం తాగడానికి నీరు, తినడానికి ఆహారం దొరకని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.


మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాలో కన్నీటి పర్యంతమవుతున్న గుగులోత్ అరుణ



కేసముద్రం-ఇంటికన్నె మధ్య యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న రైల్వే ట్రాక్ వద్ద విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


ఖమ్మం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఇంట్లోకి నీళ్లు రావడంతో ఇంట్లోని సామాన్లు, బట్టలు బయట వేసిన మహిళ



ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలోని బొక్కలగడ్డలో తడిచిన బియ్యాన్ని రోడ్డుపైనే వేయడంతో దుర్గంధం వెదజల్లుతున్న దృశ్యం


మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాలో బాధితులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలోని మున్నేరులో తమ సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులు


ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో ఇంటి ఎదుట ఆగిన బురద నీటిలోనే తమ సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులు


మహబూబాబాద్ జిల్లా ఆకేరు వాగు ఉధృతికి పాడైపోయిన వరి పంటను చూపిస్తున్న మహిళా రైతు శాంతి


ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వరద నీటిలో మునిగిన ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరం

# మూడ్రోజులైనా మురుగే

మొదటిపేజీ తరువాయి...

గణేష్‌నగర్, ధ్వంసలాపురం తదితర ప్రాంతాల్లో ఇండ్లన్నీ బురదమయంగా మారాయి. ఇండ్లలో బురదను శుభ్రం చేయడానికి కనీసం నీళ్లు కూడా సరఫరా చేయడం లేదు. కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు చేసినా సరిపడా అందుబాటులోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇంతవరకు విద్యుత్తును పునరుద్ధరించలేదు. విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు భూమిమీదనే వేలాడుతున్నవి. చీకట్లో పాములు, తేళ్లు ఇండ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్లను ఏర్పాటు చేయకపోవడం వల్ల తడిసిన బియ్యంను రోడ్లమీదనే పోయడంతో వాసన వస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నా కనీసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదు. లారీల కార్యాలయ ఆవరణలో సుమారు 200 లారీలు మునిగిపోగా, వీటి మరమ్మతులకు ఒక్కొక్క లారీకి సుమారు రూ.లక్ష ఖర్చు అవుతుందని యజమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది.


ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో తమ దుస్తులను శుభ్రం చేసుకునేందుకు తీసుకెళ్తున్న బాధితుడు



## నీళ్లు పోసినోడే లేడు..

వరదలు వచ్చి మా బతుకులు నీళ్లలోనే ఉన్నా మమ్ములను కాపాడేవాడే లేడు. మంచినీళ్లు పోసిన నాథుడే కరువయ్యాడు. ముగ్గురు మంత్రులు ఉన్నారంట.. వాళ్ల వల్ల ఏమీ ఉపయోగం ఉంది. ప్రతి ఒక్కడు మాటలు చెప్పేటోడే తప్ప పేదల గురించి పట్టించుకునే లేడు. బురదను కడుక్కోవడానికి నీళ్లు కూడా లేవు. బట్టలను ఉతుక్కోవడానికి మళ్లీ మున్నేరుకే వెలుతున్నా నయ్యా. మా బతుకులు ఇంతే.

-గాళ్ల ఉమ, బొక్కలగడ్డ, ఖమ్మం



## బీఆర్‌ఎస్సే బాగుండే

ఏ మాటకి ఆ మాట చెప్పుకోవాలంటే.. పువ్వాడ అజయ్‌కుమారే మంచి చేసిండు. పోయిన ఏడాది వరదలు వస్తే కేసీఆర్ చెప్పిండు.. అజయ్‌కుమార్ వచ్చిండు. వరదలోనే తిరిగిండు. మా కార్పొరేటర్ నాగేశ్వరావు కూడా వరద నీళ్లలోనే మాతోనే ఉండి మమ్మల్ని ఆదుకుండు. ఇప్పుడు ఆయన ఇళ్లూ మునిగిపోయింది. అయినా వచ్చిండు అర్సుకుండు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటే చాలా బాగుండేది.

-రాజేశ్వరి, బొక్కలగడ్డ, ఖమ్మం



## పేదోళ్లంటే లెక్కేలేదు

మూడు రోజులవుతున్నా నీళ్ల ట్యాంకర్ రాలేదు. ఇదేమిటని మున్సిపల్ వాళ్లను అడిగితే.. మెయిన్ రోడ్డుకే ట్యాంకర్ వస్తుందని చెబుతున్నారు. మా గల్లీకి ట్యాంకర్ రాదంట. అలాంటప్పుడు ఓట్ల కోసం మా దగ్గరకు ఎందుకు రావాలి. వచ్చేసారి ఎవడు వస్తాడో చూస్తాం. పేదోళ్లంటే ఒక్కడికి కూడా లెక్కలేదు. కేసీఆర్ పాలన ఉంటే బాగుండేది.

- చలమల నాగేశ్వరరావు, మంచికంటి నగర్, ఖమ్మం



## బియ్యం తడిసినయ్..

మున్నేరు వరదతో రాత్రిపూట మొదటి అంతస్తు కూడా మునిగిపోయింది. ఇంట్లో ఉన్న 8 క్వింటాళ్ల బియ్యం తడిసి ముద్దయ్యాయి. పాడైన బియ్యాన్ని మున్నేరులో పడేయడానికి ట్రాక్టర్ కావాలని మున్సిపాలిటీ వాళ్లను అడిగితే.. ట్రాక్టర్ పంపలేదు. ఆ బియ్యం ఇంట్లో ఉంటే పురుగులు పట్టి రోగాలు మాకే వస్తయి కదా.

-ఎడ్లపల్లి తిరుపతమ్మ, మంచికంటి నగర్, ఖమ్మం